మన్నెం వీరుడికి ఘన నివాళి



హెచ్‌బీకాలనీలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి, మాజీ ఎమ్మెల్యేలు

కుషాయిగూడ: మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను హెచ్‌బీకాలనీలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ హాజరై అల్లూరి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు రాంప్రదీప్, ప్రవీణ్, సూర్యయూత్ ఫౌండర్ కృష్ణంరాజు, జంపాల్‌రెడ్డి, గడియారం రామకృష్ణ, మల్లేష్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో పసిడి పతకం



జాతీయ పతాకంతో మనోజ్‌కుమార్

బోడుప్పల్: ఎస్ఐఎస్ కాలనీకి చెందిన దీటి మనోజ్‌కుమార్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. కిర్గిజ్‌స్తాన్‌లో జరిగిన ప్రతిష్టాత్మక డబ్ల్యూపీసీ ఆసియా పవర్ లిఫ్టింగ్ జూనియర్ విభాగం పోటీల్లో ఆయన పాల్గొన్నారు. 197.5 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో సహా ప్రదర్శనిచ్చినట్లు మనోజ్‌కుమార్ వెల్లడించాడు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



మల్లాపూర్: డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో రూ.8 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను శుక్రవారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, బీఆర్ఎస్ నేతలు దయాకర్‌రెడ్డి, నాగారం చంద్రశేఖర్, భాషిత్‌ఖాన్, శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



బాధితులకు రీఫండ్ పత్రాలను అందజేసిన కుషాయిగూడ పోలీసులు

కుషాయిగూడ: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు సూచించారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో బాధితులతో కలిసి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 90 మంది బాధితులకు రూ.15,23,484లను చెల్లించారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జూన్‌లో జరిగిన లోక్ అదాలత్‌లో బాధితులకు రీఫండ్ అభ్యర్థనపై న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా వారు సైబర్ నేరాల తీరుపై అవగాహన కల్పించారు. బాధితులు వారి అనుభవాలను పంచుకున్నారు.

ఐడబ్ల్యూఏ సభ్యురాలిగా డాక్టర్ బర్నితా బెనర్జీ



ఉప్పల్: సీఎస్ఐఆర్- నేషనల్ జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా. బర్నితా బెనర్జీ-2025 సంవత్సరానికి ఉమెన్ అసోసియేట్ వ్యవస్థాపక సభ్యురాలిగా ఎంపికైనట్లు ఆ సంస్థ శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. బెనర్జీ చేసిన అత్యున్నత సేవలను గుర్తించి ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. విజ్ఞానశాస్త్రంలో మహిళలను ప్రోత్సహించి ముందుకు తీసుకెళ్లడంలో ఆమె ఎంతో కృషిచేసినట్లు పేర్కొన్నారు.

రాజీవ్ స్వగృహ ఇళ్లను పేదలకు కేటాయించాలి

ఘట్‌కేసర్: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం లేదని మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఘట్‌కేసర్‌లో ఆయన మాట్లాడుతూ.. గత పేదల ఓట్లతో గెలిచిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పేదల కోసం ఇళ్లు నిర్మించడానికి ఖాళీ స్థలం కావాలని ప్రభుత్వం ప్రకటించడం మానుకుని అవే ఇళ్లను పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఐలా.. సీఐఏ ఎన్నికల్లో హోరా హోరీ !

నేడే పోలింగ్..బరిలో రెండు ప్యానెళ్లు
- సాధారణ ఎలక్షన్లను తలపించేలా ప్రచార జోరు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..



కుషాయిగూడ: చర్లపల్లి నోటిఫైడ్ మున్సిపల్ ఇండస్ట్రియల్ ఏరియాస్ సర్వీస్ సొసైటీ (సిన్మియాస్) ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా), చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ (సీఐఏ)లకు నేడు ఎన్నికలు జరగనున్నాయి. కాగా ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఇది సీనియర్లు, జూనియర్లకు జరుగుతున్న పోటీగా తయారైంది. పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జోనల్ అధికారులు తెలిపారు. సాధారణ ఎన్నికలను తలపించే రీతిలో హోరాహోరీగా ప్రచారాలు కొనసాగాయి. పోటీలో నిలిచిన రెండు ప్యానళ్లు గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. గతంలో ఏకగ్రీవంగా జరిగే ఈ ఎన్నికలు కాస్తా ఈసారి ఓటింగ్ వరకు వెళ్లాయి. ఇప్పటి వరకు ఈ కమిటీల ఎన్నికల్లో చర్లపల్లి పారిశ్రామికవాడలో సీనియర్ పారిశ్రామికవేత్తలే కీలక భూమిక పోషిస్తూ వస్తున్నారు. వారు సూచించిన వారే చైర్మన్లు, అధ్యక్షులుగా నియమితులయ్యారు. దీనిపై కొంత వ్యతిరేకత ఉన్నప్పటికీ అది లోలోనే ఉండేది. కానీ ఈసారి సీనియర్ల పెత్తనానికి అడ్డుకట్ట వేయాలని భావించిన కొంతమంది పారిశ్రామికవేత్తలంతా తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ఐలా, సీఐఏలో సీనియర్ పారిశ్రామికవేత్తలకు చెందిన గోవిందరెడ్డి ప్యానల్, ప్రస్తుత తాజా మాజీ చైర్మన్ జక్కా రోషిరెడ్డి ఆధ్వర్యంలో మరో ప్యానెల్ పోటీలో నిలిచాయి.

రెండోసారి దక్కని అవకాశం..

ఐలా చైర్మన్లుగా పనిచేసిన వారిలో రెండోసారి అవకాశం కోసం ప్రయత్నించిన వారందరూ.. పరాభవం చెందిన చరిత్రే ఉంది. ప్రస్తుతం చైర్మన్‌గా కొనసాగుతున్న రోషిరెడ్డి తిరిగి రెండోసారి చైర్మన్ పదవి కోసం పోటీ పడుతున్నారు. మరో వైపు ఐలా చైర్మన్‌గా పోటీలో నిలిచిన గోవిందరెడ్డి ప్రస్తుతం సీఐఏ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇక సీఐఏలో డీ.ఎస్.రెడ్డి, నాగరాజు ప్యానెళ్లు పోటీ పడుతున్నాయి. కాగా చర్లపల్లి పారిశ్రామికవాడ ఐలాలో మొత్తం 798 ఓటర్లు ఉండగా.. సీఐఏలో 495 మంది ఓటర్లు ఉన్నారు. ఐలా, సీఐఏ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో పారిశ్రామికవేత్తలు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

అత్యధిక మెజార్టీతో గెలుస్తాం



గత మూడేళ్లుగా చర్లపల్లి పారిశ్రామికవాడలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుత మేనేజింగ్ కమిటీ ఏకపక్ష నిర్ణయాలు, అవినీతి కార్యకలాపాలు ఈ పారిశ్రామికవాడ ప్రతిష్టను దిగజార్చాయి. వారికి గుణపాఠం తప్పదు. అందరి మద్దతుతో నేను అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తా.
– గోవిందరెడ్డి (దీపం గుర్తు ప్యానెల్ చైర్మన్ అభ్యర్థి)

అభివృద్ధే గెలిపిస్తుంది



గడిచిన మూడేళ్లలో చర్లపల్లి పారిశ్రామికవాడలో మేం అభివృద్ధికి బాటలు వేశాం. అదే మమ్మల్ని గెలిపిస్తుంది. నాపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రతిష్టను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. పారిశ్రామికవేత్తలు ఈ విషయాన్ని గమనించి మాకే మద్దతు ఇస్తారని నమ్మకంగా ఉన్నాం.
– జక్కా రోషిరెడ్డి (చెట్టు గుర్తు ప్యానెల్ చైర్మన్ అభ్యర్థి)

పటేల్‌కుంట చెరువును సుందరీకరిస్తాం



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం పటేల్‌కుంట చెరువును త్వరలోనే సుందరీకరిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం గుర్రపుడెక్క, లార్వా నిర్మూలనకు డ్రోన్ యంత్రంతో స్ప్రే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటేల్‌కుంట చెరువులోకి మురుగు చేరకుండా పైపులైన్ పనులు చేపడతామన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి, కాప్రా సర్కిల్ ఎంటమాలజిస్ట్ రమేష్, మాధవరెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఇందిరానెహ్రూనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ అన్నారు. ఇందిరానెహ్రూనగర్‌లో గత కొంతకాలంగా పవర్ బోర్లు లీకేజీలతో నీటిసరఫరా సక్రమంగా జరగడం లేదని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ శుక్రవారం ఇందిరానెహ్రూనగర్ కాలనీలో పర్యటించారు. పవర్‌బోర్ లీకేజీలను పరిశీలించారు. సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తానని కాలనీవాసులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్, బైరు అనిల్, అనిత, సిద్ధిరాములు, కావలి శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్, నాగేష్‌గౌడ్, మల్లేష్, రాజా, అశోక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



మల్లాపూర్: మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాచారంలోని వెస్లీ కో- ఎడ్యుకేషన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్లేట్లు అందజేశారు. ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి, మధుర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అందజేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పారితోషికం అందజేశారు.



విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

మల్కాజిగిరి: పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు నగదు ప్రోత్సాహాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి సెంట్రల్ అందజేశారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సిరివెన్నెల, తేజశ్రీ, మంజుల, ప్రసన్న, బాలేశ్వరిలు ఉత్తమ మార్కులు సాధించారు. శుక్రవారం స్కూల్ ఆవరణలో వారికి రూ.2500 నగదు పారితోషకం అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు వేముల వెంకటేష్, జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు డీజే అనుమతి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి

కుషాయిగూడ: బోనాల ఉత్సవాల్లో డీజే అనుమతి లేదని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఆలయాల కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఊరేగింపుల సమయంలో డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. డీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, వెంకన్న, సాయిలు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి : అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. సంతోషిమానగర్‌లో జరుగుతున్న ఆర్‌సీసీ పైపులైన్ నిర్మాణ పనులను డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శివగౌడ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

కుమార్తెతో సహా తల్లి అదృశ్యం



గీత

కుషాయిగూడ: భర్తతో గొడవపడిన ఓ భార్య తన కూమార్తెతో కలిసి వెళ్లిపోయిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌కు చెందిన కంతిని గోపి, గీతలకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కాగా మూడేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి వాసవీశివనగర్‌లో ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో గతనెల 19న జరిగిన గొడవతో మనస్తాపం చెందిన భార్య 22న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా కూమార్తెతో సహా వెళ్లి తిరిగి రాలేదు. 10 రోజులైనా తిరిగి రాకపోవడంతో భర్త ఆమె సోదరికి ఫోన్ చేయగా.. అక్కడకు రాలేదని తెలిసింది. దీంతో తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ సత్యానగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు.

- ఏషియన్ థియేటర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 10.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు ఉప్పల్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- కళ్యాణపురి ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11.00 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మేడిపల్లి: 11కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో పీయంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11 పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. వినియోగదారులు సహకరించాలని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

- 11కేవీ మైవిల్లాస్ ఫీడర్ పరిధిలో పీయంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3.00 నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.
- 11కేవీ కాచవాని సింగారం ఫీడర్ పరిధిలో పీయంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ ప్రతాప్‌సింగారం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంటు నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.
- 11కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో పీఎంఐ వర్క్స్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ ప్రతాప్ సింగారం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏఈ సత్యానారాయణరెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్ 11కేవీ గీతాభవానీనగర్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గోపాల్ తెలిపారు.

మలయాళస్వామి ఆరాధనోత్సవాలు

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరిలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం మలయాళస్వామి 63వ ఆరాధనోత్సవం, తయాహ్నిక విష్ణు సహస్రనామ మహాయజ్ఞం ప్రారంభించారు. ఈనెల 6 వరకు జరిగే కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజు పరమాత్మానంద గిరిస్వామితో ఓంకార పతకావిష్కరణ, విష్ణు సహస్రనామ యజ్ఞం, భగవద్గీతా పారాయణం ప్రథమ షట్కం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్ శ్రవణ్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సాధువులు, భక్తులు పాల్గొన్నారు.

మేడ్చల్‌కు అదనపు కోర్టులు

కుషాయిగూడ: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టుకు 8 కొత్త కోర్టులు మంజూరైనట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. అమరేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 28 కోర్టులను మంజూరు చేస్తూ.. జారీచేసిన ఉత్తర్వుల్లో కుషాయిగూడలోని మేడ్చల్ జిల్లా కోర్టుకు 2 ఫ్యామిలీ కోర్టులు, 2 అదనపు కోర్టులు, 4 అదనపు మేజిస్ట్రేట్ కోర్టులు మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఉప్పల్: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ మహంకాళి దేవాలయం వద్ద గుర్తు తెలియని వృద్ధుడు (70) అపస్మారక స్థితిలో పడిఉన్నాడని, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైడ్రా ఆధీనంలోకి పార్కు స్థలం !



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని రెడ్డిఎన్‌క్లేవ్‌లో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. పార్కు స్థలం చుట్టూ.. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి స్థలాన్ని పరిరక్షించారు. హైడ్రా అధికారి మల్లేశ్వర పర్యవేక్షణలో ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం కార్పొరేటర్ శాంతి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ప్రజల తరపున పార్కు స్థలం కోసం పోరాటం సాగిస్తున్నామన్నారు. హైడ్రాతో పార్కు స్థలం ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్మ, స్థానికులు నర్సింహారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వృక్షం నరికివేత !

అడ్డుకున్న స్థానికులు



కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, శివసాయినగర్, డీ మార్ట్ సమీపంలో ఓ భారీ మర్రిచెట్టు, తాడిచెట్టును నరికివేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డుపడటంతో మధ్యలోనే వదిలేసి వెళ్లారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఓ బిల్డర్ తనకు అనుమతులున్నాయంటూ.. బుకాయించి తాటిచెట్టును నరికేసి అనంతరం మర్రిచెట్టును తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో అనుమతులపై స్థానికులు ప్రశ్నించారు. ఇక్కడితో ఆపకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చెట్లను నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్థానిక సమస్యలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: కాలనీల్లో ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అధికారులకు సూచించారు. శుక్రవారం సీతారాంనగర్, వెస్ట్ శ్రీకృష్ణానగర్ కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో చెత్త, చెదారంతో పాటు డెబ్రిస్ అలాగే ఉందని, ఆయన దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, చెట్లకొమ్మలు తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీల్లో చెత్త, చెదారం తొలగించాలని శానిటేషన్ అధికారులకు సూచించామన్నారు. ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, ఎస్ఎస్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ గిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తపై అవగాహన



బోడుప్పల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉందామని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. శుక్రవారం బోడుప్పల్‌లో 100 రోజుల ప్రణాళికలో భాగంగా 13వ డివిజన్‌లోని రాజీవ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కాలనీవాసులకు తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటి యజమానులు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. ఎవరైనా చెత్తను రోడ్లు, ఖాళీ స్థలాల్లో వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నారాయణరెడ్డి, కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్, సుభాష్‌రెడ్డి

మల్లాపూర్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డిలు అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి యువతరానికి దొడ్డి కొమురయ్య స్ఫూర్తిదాయకమన్నారు. మల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు శైలేష్‌రెడ్డి, ముత్యంరెడ్డి, దొడ్డి యాదగిరి, రామయ్య పాల్గొన్నారు.

మేడిపల్లి: తెలంగాణ స్వయంపాలన కోసం సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని పలువురు నేతలు కొనియాడారు. జనగామ జిల్లాకు దొడ్డి కొమురయ్య పేరును పెట్టాలని, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కురుమ యువచైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నర్సింహ, పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్ కొడె పోచయ్య డిమాండ్ చేశారు. శివేందర్‌కుర్మ, నోముల ప్రసన్నకుమార్, సత్యనారాయణ కురుమ, భాస్కర్, రాజు, వెంకటేష్, సోమలింగం, పర్వతాలు తదితరులున్నారు.

బోడుప్పల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని శుక్రవారం బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీలో సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బాపిరాజు, సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, లక్ష్మి, ప్రమీల, మాధవి, నాగరాజు, దండు రమేష్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

